## క్లుప్తంగా

### అప్రమత్తంగా ఉండండి



మందులు పరిశీలించి సలహాలు ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్

తలుపుల: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్ర నాయక్ వైద్యులకు సూచించారు. తలుపుల పీహెచ్‌సీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, ఫార్మసీ, కాన్పుల గది, వ్యాధి నిరోధక టీకాల గదిని పరిశీలించి వైద్యాధికారి అప్తాబ్‌కు తగు సూచనలు చేశారు.

### కనగానపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అనిల్‌కుమార్



ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనిల్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న కార్యదర్శులు

కనగానపల్లి: కనగానపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అనిల్‌కుమార్‌ను నియమించారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న వెంగన్న అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో కనగానపల్లి ఈఓఆర్డీగా పని చేస్తున్న అనిల్‌కుమార్‌కు అధికారులు ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అనిల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

### యువతకు శిక్షణ, ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న యువతీ యువకులకు బెంగళూరులో ట్యాలీ కోర్సులపై శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. 18 నుంచి 26 ఏళ్ల మధ్య వయసు ఉండి పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. 35 రోజుల శిక్షణ కాలంలో ఉచితంగా భోజన వసతి కల్పిస్తామన్నారు. కంప్యూటర్, కమ్యూనికేషన్, ఇంటర్వ్యూ స్కిల్‌పై శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తామన్నారు. నెలకు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### పుట్టపర్తిలో జిల్లా కోర్టుకు హైకోర్టు సానుకూలం

- జిల్లా జడ్జికి ప్రతిపాదనలు అందజేసిన బార్ అసోసియేషన్



జిల్లా జడ్జి శ్రీనివాసులుకు ప్రతిపాదన పత్రాలు అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

సాక్షి, పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో జిల్లా కోర్టు ఏర్పాటుకు హైకోర్టు సానుకూలంగా స్పందించిందని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లా కోర్టు జడ్జి శ్రీనివాసులును బార్ అసోసియేషన్ సభ్యులు కలిసి ప్రతిపాదనల పత్రాలు అందజేశారు. జిల్లా కోర్టుతో పాటు సీనియర్ సివిల్ జడ్జి కోర్టును కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల పర్యటించిన హైకోర్టు జడ్జి మన్మథరావుకు వినతిపత్రం అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన తెలపడంతో.. తాము వాటిని తయారు చేశామన్నారు. పుట్టపర్తిలో కోర్టులకు వసతులు మెరుగుపరచి తగిన సిబ్బందిని నియమించాలి కూడా విజ్ఞప్తి చేశామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు లెక్కల భూషన్, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

రాప్తాడు: గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత సూచించారు. సోమవారం రాప్తాడు-4, ప్రసన్నాయపల్లి-1 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా కార్యాక్రమంలో భాగంగా గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం, ఆకుకూరలు, తాజా పండ్లు తినాలన్నారు. రోజూ కోడి గుడ్లు, రాగి జావా తీసుకోవాలన్నారు. రక్తహీనతతో బాధపడే మహిళలు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యులు సూచించిన ఆహారం తీసుకోవాలని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు ఎక్కువగా ఆకుకూరలు, గుడ్డు వంటి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం ఎలా తయారు చేసుకోవాలో ప్రయోగాత్మకంగా చూపించారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు తాగించాలని, ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారం తినిపించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సావిత్రి, సూర్యకళ, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పది పరీక్షలు



ధర్మవరంలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం



గాండ్లపెంటలో పరీక్ష కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థులు

- ఉత్సాహంగా రాసిన విద్యార్థులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్
- కేంద్రాలు తనిఖీ చేసిన అధికారులు

సాక్షి నెట్‌వర్క్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో పదో తరగతి విద్యార్థులు పరీక్ష సమయం 9.30 కాగా.. గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. 8.45 నుంచి విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించారు. మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష సాగింది.

- ధర్మవరంలో సోమవారం పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగాయని ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్ తెలిపారు. మొత్తం 10 పరీక్షా కేంద్రాలలో 2,652 మంది విద్యార్థులకు గాను 2,544 మంది పరీక్ష రాశారు. వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.
- తాడిమర్రిలోని జెడ్పీ హైస్కూలులో చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ శ్రీరాములు ఆధ్వర్యంలో, కేజీబీవీలో చీఫ్ సూపరింటెండెంట్ చెన్నకృష్ణారెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో ఇన్విజిలేటర్లు టెస్ట్ పరీక్షలు నిర్వహించారు. 291 మంది విద్యార్థులకు గాను 266 మంది పరీక్షలు రాశారు.
- బత్తలపల్లిలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. 487 విద్యార్థులకు గాను 477 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ చాముండేశ్వరి, సుధాకర్ నాయక్ తెలిపారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ శివశంకర్‌నాయక్, స్క్వాడ్ సభ్యులు తనిఖీలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. వైద్యాధికారి గంగిరెడ్డి రెండు కేంద్రాలను తనిఖీ చేసి, వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు.
- గాండ్లపెంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు కటారుపల్లి కస్తూరిబా బాలికల విద్యాలయంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎంఈఓ చెన్నకృష్ణ తనిఖీ చేశారు. 22 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ అధికారులు తెలిపారు.
- ఎన్‌పీకుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ధనియానిచెరువు, టీఎస్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీ, నాగార్జున ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పరీక్షలు రాశారు. 244 మంది విద్యార్థులకు గాను 231 మంది పరీక్షలు రాసినట్లు ఎగ్జామ్స్ చీఫ్ అధికారి రియాజ్, డీఓ నాగరాజు తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీఓ ఆదినారాయణ, తహసీల్దార్ నరేంద్రకుమార్ తనిఖీ చేశారు.
- నల్లచెరువు మండలం దేవిరెడ్డిపల్లి వద్దనున్న ఏపీ మోడల్ స్కూల్లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షకు 288 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ తిరుపాల్ నాయక్ తెలిపారు.
- ఓడీచెరువు మండల కేంద్రంలోని పదవ తరగతి విద్యార్థులకు మొదటిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం నాలుగు సెంటర్లలోనూ విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షలకు హాజరయ్యారు. అమడగూరు మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షకు 222 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరైనట్లు డిపార్ట్‌మెంటల్ అధికారి నరేష్ నాయక్ పేర్కొన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా భాస్కర్, ఏడీఓగా పవన్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.
- కదిరి మున్సిపల్, రూరల్ మండల పరిధిలో సోమవారం 11 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. 2,114 మంది పరీక్షలకు హాజరయ్యారు. 58 మంది గైర్హాజరయ్యారు. వీవర్స్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ లాజర్ తనిఖీ చేశారు.
- నల్లమాడ మండల కేంద్రంలోని రెండు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్ష జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 316 మంది విద్యార్థుల్లో 13 మంది, ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో 158 మందికి గాను ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్‌లు సతీష్, బాలాజీ, డిపార్ట్‌మెంట్ అధికారులు వెంకటరెడ్డి, ఖాదర్‌బాషా తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని డీఈఓ మీనాక్షి తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్ మోహన్‌రెడ్డి, రమణ దగ్గరుండి పరీక్షలను పర్యవేక్షించారు. అడిషనల్ డిపార్ట్‌మెంట్ అధికారి రామాంజి పాల్గొన్నారు.



ఎన్‌పీకుంటలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

- పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి ఉన్నత పాఠశాల, వాసవి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ అరుణ్‌బాబు తనిఖీ చేశారు. కేంద్రాల్లో మౌలిక వసతులు, భద్రతా సిబ్బంది, ఉచిత వైద్య కేంద్రాలను పరిశీలించారు. ఆర్డీఓ భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.
- కనగానపల్లిలో తొలి రోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. రెండు కేంద్రాల్లో 391 మందికి గాను 374 మంది హాజరయ్యారు.
- చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షల కోసం రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 166 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ముగ్గురు గైర్హాజరైనట్లు పరీక్ష చీఫ్ ఓబుళమ్మ తెలిపారు. అలాగే ఏపీ మోడల్ స్కూల్ కేంద్రంలో 137 మందికి గాను ఒకరు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ స్వర్ణలత తెలిపారు.

### నేడు దుద్దుకుంట ఎన్నికల ప్రచారం

ఓడీచెరువు : మండలంలోని టి.కుంట్లపల్లి పంచాయతీ టి.కుంట్లపల్లి, టానాకొత్తపల్లి, తాటి మేకలపల్లి, పెద్దసానివారిపల్లి, బసప్పగారిపల్లి చెర్లోపల్లిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రాజునాయుడు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిదులు, స్టోరు డీలర్లు, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

### నేడు గుంజేపల్లిలో కేతిరెడ్డి ప్రచారం

ముదిగుబ్బ: గుంజేపల్లిలో మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ అనుబంధ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి నారాయణరెడ్డి, పార్టీ కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు తరలిరావాలని వారు కోరారు.

### టీడీపీలో వర్గపోరు బట్టబయలు

కొత్తచెరువు: తెలుగుదేశం పార్టీలో వర్గపోరు బట్టబయలైంది. టీడీపీ పుట్టపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి సోమవారం కొత్తచెరువు మండలం నాగిరెడ్డిపల్లి తిప్పబాట్లపల్లి, ఇరగంపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిప్పబాట్లపల్లికి చెందిన ఒక వర్గం నాయకులు ప్రచారంలో పాల్గొనగా.. అదే గ్రామానికి చెందిన మరొక వర్గం నాయకులు వాగ్వాదం చేసుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తేలేక సింధూరరెడ్డి అక్కడి నుంచి వెనుదిరిగారు.

### ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

అమడగూరు: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామనాథరెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన కసముద్రం, తుమ్మల, పూలకుంటపల్లి, చినగానిపల్లి గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. సచివాలయాలను సందర్శించి ఎన్నికల కోడ్ అమలును పరిశీలించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, పోస్టర్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫొటోలు తొలగించినట్లు చెప్పారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశామన్నారు. ఎన్నికలు ముగిసి, కోడ్ ఎత్తేసేంత వరకూ ఎక్కడా రాజకీయ పార్టీల జెండాలు, నాయకుల ముఖ చిత్రాలు, గోడలపై రాతలు, బ్యానర్లు కనపడటానికి వీల్లేదన్నారు. పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరిస్తూ కోడ్ అమలు చేయాలన్నారు.

## ఎన్నికల్లో గెలుపునకు సహకరించండి



మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ శాసనసభ్యులు డాక్టర్ కడపల మోహన్‌రెడ్డిని కదిరిలోని ఆయన నివాసంలో సోమవారం పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి భేటీ అయ్యారు. ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని ఆయన కోరారు. అలాగే కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని, డాక్టర్స్ అసోసియేషన్ రీజనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ దేశాయి నాగేంద్రకుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే దుద్దుకుంట మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వెంట నల్లమాడ, ఓడీ చెరువు మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కె.సూర్యనారాయణ, రాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కె.రవిచంద్రారెడ్డి, అమడగూరు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఓడీసీ జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు శివశంకర్‌రెడ్డి, ఎ.మధుసూదన్‌రెడ్డి, షామీర్‌బాషా, ఉంట్ల లక్ష్మీపతిరెడ్డి, బాలిరెడ్డి, నరసింహామూర్తి, విశ్వనాథరెడ్డి, బయపరెడ్డి, నరసింహారెడ్డి తదితరులున్నారు.

### బాధితుడి కుటుంబానికి పరామర్శ



చెన్నప్ప కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్: కుమ్మరపేటలో ఇటీవల చెందిన మేదర చెన్నప్ప కుటుంబాన్ని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అర్బన్ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్ సూర్యాగౌడ్ ఉన్నారు.

## స్నేహానికి గుర్తుగా రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం తమ స్నేహితుడి జ్ఞాపకార్థం పలువురు మిత్రులు రక్తదాన శిబిరం నిర్వహించారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సద్దికూటి వెంకట్రామిరెడ్డి ఏడాది క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. చిన్నప్పటి నుంచి తమ మధ్య కలసి చదువుకుని, పెరిగిన వ్యక్తి చనిపోవడం ఆ స్నేహితులకు తీరని బాధను మిగిల్చింది. వెంకట్రామిరెడ్డి మరణించి సోమవారానికి యేడాది కావడంతో రక్తదాన శిబరం ఏర్పాటు చేశారు. దాదాపు 30 మందికి యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సద్దికూటి శివారెడ్డి, ఫణిరెడ్డి, కొండారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, ఆవుల ధనుంజయ రెడ్డి, వేణు, వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

ఎన్‌పీకుంట: ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆదినారాయణ, ఏపీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రణాళిక ప్రకారం మండల వ్యాప్తంగా చేపట్టనున్న పండ్ల తోటల పెంపకం, బ్లాక్ ప్లాంటేషన్, మొక్కల పెంపకం తదితర విషయాలను వెల్లడించారు. 200 ఎకరాల్లో వివిధ రకాల పండ్లతోటల పెంపకం కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఐదు ఎకరాల పట్టాభూమి కలిగి, ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాసు బుక్కుతో ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అలాగే మూడు ఎకరాల్లో బ్లాక్ ప్లాంటేషన్, 30 హెక్టార్లలో గల బోడిగుట్టలలో మొక్కల పెంపకం చేపడుతున్నట్లు వారు వివరించారు.

### చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ

ముదిగుబ్బ: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ముదిగుబ్బలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ యతీంద్ర సోమవారం ప్రారంభించారు. ఎండలు తీవ్రత పెరిగిన ఈ సమయంలో చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ సింగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

అమడగూరు: కుమ్మరిండ్లు చెక్‌పోస్ట్ వద్ద ఓ వ్యక్తి నుంచి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మగ్బూల్‌బాషా తెలిపారు. సోమవారం కర్ణాటక సరిహద్దులో ఉన్న కుమ్మరిండ్లు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు. లోకోజుపల్లికి చెందిన మద్రిమేకల నారాయణ 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లు తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## జగనన్నతోనే సుపరిపాలన



తంబాపురంలో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

బత్తలపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం తంబాపురంలో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత సర్పంచు సానే జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ - వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి తావులేకుండా ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంత మేరకు అమలు చేశారో ప్రజలందరికీ తెలుసున్నారు. ఈసారి ఓట్ల కోసం వచ్చినపుడు గత హామీలు ఏమయ్యాయో నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జగనన్న అమలు చేసి సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులే తమను గెలిపిస్తాయని, ప్రజల ఆశీర్వాదంతో ధర్మవరం కోటపై మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు మాయమాటలు నమ్మకుండా.. తమకు అన్ని విధాలా మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కమతం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, మాజీ సర్పంచ్ సానే సూర్యనారాయణరెడ్డి, నాయకులు శరత్‌కుమార్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, డి.లింగమయ్య, ఎ.లింగమయ్య, ఎస్వీ రమణారెడ్డి, బీదాల మారుతిరెడ్డి, ఓబిలేసు, సానే భాస్కర్‌రెడ్డి, నాగప్ప, రవి, ఏ.ప్రతాప్, టి.సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాల కమిటీ ఏర్పాటు

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ రెండో తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. దేవదాయ ధర్మదాయ కమిషనర్ ఉత్తర్వుల మేరకు 11 మంది సభ్యులతో శ్రీవారి బ్రహోత్సవాల కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమిటీలో కదిరికి చెందిన బి.విశ్వనాథ్‌రెడ్డి, నామా వెంకటరామప్రసాద్, లింగాల లోకేశ్వర్‌రెడ్డి, బి.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.సి.వెంకటరమణనాయక్, సి.గంగాధర్, కె.శాంతమ్మ, వేమల భాగ్యలక్ష్మి, జి.త్రివేణి, వి.చందుప్రియ, డి.శ్రీదేవి సభ్యులుగా ఉన్నారు. బ్రహ్మోత్సవాల్లో నూతన కమిటీ సభ్యులు పాల్గొనాలని ఈఓ తెలిపారు.



# మీ ఆదరణ మరువలేనిది



ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మక్బూల్ అహ్మద్



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ

- ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్

తలుపుల: వైఎస్సార్‌సీపీ పట్ల ప్రజలు చూపుతున్న ఆదరణ మరువలేనిదని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. అభ్యర్థిగా ప్రకటన వెలువడిన అనంతరం ఆయన నియోజకవర్గంలో సెంటిమెంట్‌గా నిలిచిన సంగటివారిపల్లిలో తొలిసారిగా పర్యటించి నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం పార్టీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ గిరిధర్‌రెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్ డీకే బాబుతో కలిసి ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. తొలుత మండల కేంద్రం తలుపుల డిప్పల చేను వద్ద మక్బూల్ అహ్మద్‌కు యువత ఘనంగా స్వాగతం పలికింది. బాణసంచా కాల్చుతూ.. వెయ్యికి పైగా బైక్‌లతో సంగటివారిపల్లి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంగటివారిపల్లి, వేమలగొంది గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. సర్పంచ్ గాయత్రి ఆధ్వర్యంలో మహిళలు హారతులు పట్టి స్వాగతించారు. సంక్షేమ ఫలాలు ఇలాగే కొసాగాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫినాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్,నియోజకవర్గ మాజీ సమన్వయకర్త ఇస్మాయిల్, నాయకులు సాదత్ అలి, మద్రి రామయ్య, వివేకానందరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మనోహర్‌నాయుడు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.